# ఉద్యోగ విజయం

## "ఆమ్యా ఆమ్యా" ఎంప్లాయిమెంటు ఎక్ఛేంజి రెన్యువల్ కౌంటరు దగ్గర గోడమీద ఎవరో సుద్ద ముక్కతో రాసారు.

నవ్వొచ్చింది. 'లంచం' అనే మాటకి ప్రత్యామ్నాయంగా అంత చక్కని పదాన్ని ఉపయోగించిన ముళ్ళపూడిని మనసులోనే అభినందించుకోకుండా వుండలేకపోయాను. కొన్ని దశాబ్దాల పాటు నిలబడి పోయే వ్యంగ్య పదమది.

"ఏదీ మీ కార్డు?"

కిటికీ లోపల్నుంచి క్లర్కు అడిగే వరకూ ముళ్ళపూడి ఆలోచనలోనే వుండిపోయాను.

నా కార్డందించాను. అది చూసి క్లర్కు తన పుస్తకంలో రాసుకుంటున్నాడు.

"సార్! నా రిజిస్ట్రేషనయి ఎనిమిదేళ్ళయింది. ఇప్పటి వరకూ ఒక్క కాల్ కూడా రాలేదు".

నీళ్ళునమిలాను. నా మాటలు ఆ క్లర్కుకి వినబడ్డాయో లేదో అనుకున్నాను. కాని

"మీరు మధ్యాహ్నం లంచవర్లో ఓసారి కనబడండి."

అన్నాడతను యధాలాపంగా నా కార్డు మీద డేటు వేసి సైను చేస్తూ.

నాకు చాలా ఆశ్చర్యం వేసింది.

ఎంప్లాయిమెంటు ఆఫీసుల్లో గుమస్తాలు ఆర్టీసీ బస్సుల్లో కండక్టర్లు ఆపాటి సౌమ్యంగా మాట్లాడారంటే అదొక ప్రపంచ వింత కింద లెక్కే!

అతను చెప్పిన ప్రకారం మధ్యాహ్నం అతన్ని కలిసేను.

"మీ పేరు రామాంజనేయ శాస్త్రి కదూ!" అతనే అన్నాడు మొదట.

అవునంటూ తలూపేను.

"ప్లీడరు గుమస్తా రామారావు గారు మీ మామయ్యే కదూ!"

మా రామం మామయ్య ఇక్కడికెలా వచ్చాడా అని ఆశ్చర్యపోయేను.

"పది రోజుల క్రితం మీ మామయ్య గారు చెప్పారు లెండి. ఎక్కడైనా వేకెన్సీలుంటే మీకు కాల్ లెటరు పంపించమని. ఇవాళ మీరొస్తారని కూడా చెప్పారు."

ఆ గుమస్తా అంత శాంతంగా ఎందుకు మాట్లాడేడో ఇప్పుడర్థమయింది. ఇదంతా మామయ్య మహత్యమన్నమాట!

ఇలాంటి చిన్న చిన్న ఉపకారాలు చేసినట్లే చేసి తన కూతురు కోతిని — అదే సీతని నాకంటగడదామనుకుంటున్నాడు కాబోలు మామయ్య. మన దగ్గర అలాంటి పప్పులేం ఉడకవు. పెళ్ళి విషయంలో మాత్రం మామయ్యకి టోపీ వెయ్యవలసిందే.

"అయితే ఎక్కడైనా ఖాళీలున్నాయా?"

ఆబగా అడిగేను.

"ఉన్నాయా కాదు ఉన్నది. ఒకటే పోస్టు. ఈ ఆఫీసులోనే. మీకెలాగూ ఎనిమిదేళ్ళ సీనియారిటీ వుంది కాబట్టి మీకు మీతోబాటు మరో నలుగురికి కాల్ లెటర్లు పంపిస్తాం. ఆ పై విషయాలు మీరు చూసుకోండి"

చెప్పడం అయిపోయినట్టుగా సిగరెట్టు తీసి వెలిగించాడతను.

చూసుకోండి అంటే!

నా చీకటి బుర్రలో లైటు వెలిగింది.

అంటే — "మామయ్య" — అన్నమాట.

"ఎంతవుతుంది సార్?"

డైరెక్టుగా అడిగేసాను. మామయ్యలాగ నాకు లౌక్యం తెలీదు మరి!

"ఇటువంటి పోస్టులకు పై వాళ్ళ దగ్గరైతే పదిహేను వందల దాకా తీసుకుంటాను. కాని మీ మామయ్య గారు నాకు బాగా తెలిసిన వారవటాన మీరు వెయ్యిరూపాయలివ్వండి చాలు."

ఉద్ధరిస్తున్నట్టుగా ఫోజు పెట్టి చెప్పాడతను.

ఆహా! ఎంత ఉదా(ద)ర స్వభావం!

మా మామయ్య పరిచయాన్ని ఆధారంగా చేసుకుని మరో రెండు వందలు ఎక్కువ గుంజుతున్నాడన్నమాట!

ఆ మధ్య మా క్లాస్‌మేట్ అవధాని గాడికి ఇటువంటిదే ఒక అవకాశం వస్తే ఎనిమిది వందలిచ్చి కాల్ రప్పించుకున్నాడ్ట. ఇటువంటి వీడు వెయ్యి అడుగుతున్నాడు. ఏం చేస్తాం. వెయ్యిరూపాయల కోసం చూసుకుంటే "నిక్షేపం" లాంటి వుద్యోగం చెయ్యిజారిపోతుంది.

"సరే! రేపు కలుస్తాను సార్." అని చెప్పి ఇంటికొచ్చేసాను.

మర్నాడు అతనడిగిన వెయ్యి రూపాయలూ తీసుకెళ్ళి రహస్యంగా అతని చేతిలో పెట్టాను.

నేను చూస్తూ వుండగానే నా కాల్ లెటరు పోస్టు చేయించాడు. నా చేతికివ్వెయ్యవయ్యా అంటే అలా వీల్లేదు పద్ధతి పద్ధతే అన్నాడు.

వీడి పద్ధతి మండినట్లే వుంది అనుకుంటూ మామయ్య ఇంటి వైపు నడిచాను.

** ** **

"ఏరా ఇలా వచ్చావు?"

గుమ్మంలో అడుగుపెట్టగానే మామయ్య పలకరించేడు.

"అమ్మాయ్! సీతా! బావొచ్చాడు కాసిన్ని మంచి నీళ్ళు పట్టా" లోపలికి కేకేసాడు.

అతనలా అనడమే తరువాయి మా సీత కోతి గ్లాసు నిండా మజ్జిగతో తయారైంది 'బావా!' అనుకుంటూ.

నాకు దాన్ని చూస్తేనే కడుపులో తిప్పుతుంది. జూ లోంచి తప్పించుకొచ్చిన ఎలుగ్గొడ్డులా వుంటుంది.



కళ్ళుమూసుకుని ఆ మజ్జిగ తాగేసాను.

ఇంకాస్సేపుంటే బాతాఖా(ఖూ)నీ వే(చే)స్తుందేమోనని భయం వేసి మామయ్య వైపు తిరిగి పోయి జరిగిందంతా చెప్పాను.

మామయ్య కొంచెం సేపు సులోచనాలు తీసేసి ఆలోచనలో పడ్డాడు.

"అవినీతి నిరోధక శాఖ సహాయ మంత్రి ధర్మరాజు నాకు కొంచెం తెలుసు. అతని ద్వారా ప్రయత్ని



# గరిమెళ్ళ శ్రీనివాస్

ద్దాం. నువ్వు రేపు ఉదయం ఒకసారిరా. ఉదయాన్నే వెళితే ఇంట్లో దొరుకుతాడు''

మర్నాడుదయం ఏడుగంటలకు నేను మామయ్యా సదరు అ.ని.శా. సహాయ మంత్రులు ధర్మారాజు గారి ఇంటికి వెళ్ళాం.

మేం వెళ్ళేసరికి ధర్మారాజు గారు పూజలో వున్నారు. నౌకరు మమ్మల్ని హాల్లో వున్న సోఫాలో కూర్చోబెట్టాడు.

కొంతసేపటికి పూజ ముగించుకుని మంత్రి గారు బైటకి వచ్చారు.

''నమస్కారమండి''

నేను మామయ్యా లేచి నిలబడి ఒకేసారి ఆయనకి నమస్కారం చేసాం.

మమ్మల్ని కూర్చోమని మా ఎదురుగా వున్న సోఫాలో కూర్చుంటూ మామయ్య వైపు తేరి పార చూసేడు ధర్మరాజుగారు.

''నువ్వు రామానివి కదూ!''

కళ్ళద్దాలు సర్దుకుంటూ అడిగారు.

మంత్రిగారు తనని గుర్తు పట్టేసరికి సిక్స్టీన్ ఎమ్మెమ్ లాగ వుండే మామయ్య ముఖం సెవెంటీ ఎమ్మెమ్‌లోకి బ్లోఅప్ చేసినట్లయి పోయింది.

''అవునండి. రెండో క్లాసునుండి నాలుగో క్లాసు వరకూ తమతో కలిసి చదువుకునే భాగ్యం నాకు కలిగిందండి. ఆ తరువాత తమరు చదువాపేసి ప్రజాసేవలోకి దిగిపోయేరండి. అయినా తమవంటి వారికి నేను గుర్తున్నానంటే అది నా పూర్వజన్మ సుకృతమండి''

వంకీలు తిరిగిపోసాగాడు మామయ్య.

''హార్నీ! ఎన్ని మాటలు నేర్చావు. అప్పుడు మన్ను తిన్న పాములాగ వుండే వాడివి!''

మనసులోనే తిట్టుకున్నాను.

''ఇంతకీ ఏం పని మీద వచ్చారు?''

విషయంలోకి ఎలా దిగాలా అని లజ్జా సజ్జాలు పడుతున్న మామయ్యకి అవకాశం వచ్చింది.

''వీడు నా మేనల్లుడండీ'' అంటూ నన్ను అతనికి చూపించాడు. నేను వినయంగా మరోసారి నమస్కారం చేసాను.

అతనా నమస్కారాన్ని అందుకుని ''అయితే!'' అన్నట్లుగా చూసాడు.

''ఈ వూళ్ళో ఎంప్లాయిమెంటు ఆఫీసులో ఒక ఖాళీ వుంది. దానికి ఇంటర్వ్యూకి రమ్మని వీడికి కాల్లెటరు కూడా వచ్చింది. తమలాంటి మీరు ఆఫీసరుకి చెప్పి మాట సాయం చేస్తే జన్మ జన్మలకి మీపేరు చెప్పుకుని బతుకుతాడు.''

''ఓస్ ... ఇంతేనా... ఇంకేదో అనుకున్నాను. ఆ ఆఫీసరు మనవాడేలే. నేను రికమెండ్ చేస్తేనే అక్కడ ఆఫీసరయేడు. నేను ఫోను చేస్తాను. మీ వాడి పేరు నెంబరు రాసియ్యి.'' అన్నాడాయన ఇదో పెద్ద విషయమా అన్నట్లు.

ఆ మాటలు విని మామయ్య మహదానందపడి పోయాడు. ఉద్యోగం వచ్చినట్లే భావించేసాడు. వెంటనే జేబులోంచి రెండు వేల రూపాయలు తీసి మంత్రిగారి చేతిలో పెట్టి చేతులు నలుపుకుంటూ నిలబడ్డాడు.

''ఇప్పుడిదంతా ఎందుకు రామం! బాల్య స్నేహితుడివి నీ దగ్గర కూడానా!''

అన్నాడాయన ఆ డబ్బు జేబులో దోపుకుంటూ.

''అన్నన్న..... ఎంత మాట.... తమకు విషయం గుర్తుండడం వల్లనే మా పని సానుకూలమైంది. వెధవది డబ్బుదేముంది''

మరింత వినయం ప్రదర్శించేడు మామయ్య.

''సర్లెండి. మీరింక వెళ్ళొచ్చు. ఇంటర్వ్యూ రేపనగా నువ్వోసారి నాకు కనబడు''

అని మామయ్యకి చెప్పేసి కర్టెను తొలగించుకుని లోపలి కెళ్ళిపోయారు (అవి) నీతి నిరోధక శాఖ సహాయ మంత్రులు శ్రీశ్రీశ్రీ (అ) ధర్మరాజు గారు.

''మామయ్యా! ఈయన అవినీతి నిరోధక శాఖకి మంత్రి గదా! మరి మన దగ్గర రెండువేలు లంచం పుచ్చుకున్నాడేం?''

మనసులో దొలుస్తున్న విషయాన్ని బైటికొచ్చాక మామయ్య నడిగేసాను.

మామయ్యోసారి చుట్టూ చూసి......

''ఉష్.....గట్టిగా అనకు......ఇతనికి ముందు ఈ శాఖలో వున్న మంత్రి ఇటువంటి పనులకి అయిదు వేలు తీసుకునేవాడు. దాన్ని ఈయన రెండు వేలు చేశాడు. అంటే అవినీతి అరవైశాతం తగ్గినట్లే గదా!'' అన్నాడు.

** ** **

అ.ని.శా.సహాయ మంత్రి గారు రాసిచ్చిన ఉత్తరం తీసుకుని నేను, మామయ్య ఎంప్లాయిమెంటు ఆఫీసుకి చేరుకున్నాం.

అప్పుడు మధ్యాహ్నం రెండయింది.

ఆ మర్నాడుదయం పది గంటలకు ఇంటర్వ్యూ.

తిన్నగా ఆఫీసరు గారి గదిలోకి వెళ్ళబోతున్న మమ్మల్ని ప్యూను పున్నయ్య సైంధవుడిలాగ అడ్డేసాడు.

ఆఫీసరు గారి దగ్గరికి వెళ్ళాలయ్యా అన్నాము. లోపల ఎవరో వున్నారు వెళ్ళడానికి వీల్లేదన్నాడు. ఫలానా మంత్రిగారు పంపించారయ్యా అని చెప్పాము. అబద్ధమనుకుంటాడేమోనని ఆ ఉత్తరం కూడా చూపించాం. వీల్లేదన్నాడు. చేసేది లేక అక్కడున్న బెంచి మీద కూలబడ్డాము.

అయిదయింది. ఆరు కూడా అవొచ్చింది.

ఆఫీసరు గదిలోంచి ఎవరూ బయటికి రాలేదు. ఆఫీసరూ రాలేదు.

ఏం చెయ్యాలో ఎలా చెయ్యాలో మాకేమీ తోచడం లేదు.

ఎదురుగుండా తలుపు దగ్గర ''బుల్ డాగ్'' లాగ కూర్చుని మావైపు గురగురా చూస్తున్నాడు ప్యూను పున్నయ్య.


ఇంతలో మా దగ్గరికి ఒకాయన వచ్చాడు. చేతిలో ఫైళ్ళున్నాయి. చూడబోతే ఆ ఆఫీసులో పనిచేస్తున్న వాడిలాగవున్నాడు.

''ఎంతసేపని అలాకూర్చుంటారు. పాతికో పరకో ఆ ప్యూను చేతిలో పెట్టి లోపలికి వెళ్ళండి''.

సలహా చెప్పి చరచరా బైటికి వెళ్ళిపోయాడతను.

అయితే ఆ విషయం మామయ్యకి తెలీక కాదు. కాని డెలిబరేటుగా అలా ఆఫీసులోనే ఇస్తే ఏం కొంప మునుగుతుందోనని భయపడుతున్నాడు ఇంతవరకూ.

ఆ వ్యక్తి అలా చెప్పగానే మామయ్య గబగబా




ప్యూను పున్నయ్య దగ్గరికి వెళ్ళాడు.

పున్నయ్య చేతిలో పాతిక రూపాయలు పెట్టాడు మామయ్య.

ఆ పాతిక మామయ్య ముఖానికి వేసి కొట్టాడు పున్నయ్య.

నాకు ఒళ్ళు మండిపోయింది.

''వాల్లాల్లేవయ్యా. ఇవ్వావు బోడి పాతిక. మంత్రి గారి రికమండేషనుతో రేపుఉద్యోగం కొట్టెయ్య బోతున్న వాడివి పాతికా ఇచ్చేది. ఇస్తే వందియ్యి. లేదా ఈ పాతిక కూడా తీసుకుపోయి నీ పెళ్ళానికి పూలు కొని పట్టుకెళ్ళు నాపేరు చెప్పి.''

ఆ ప్యూనుగాడు అంత అసహ్యంగా మాట్లాడేసరికి నా కోపం తారాస్థాయికి చేరుకుంది. కాని మామయ్య నన్ను తొందరపడవద్దని కళ్ళతోనే హెచ్చరించి ముఖానికి నవ్వొకటి అతికించుకుని

''అలా కోపం తెచ్చుకుంటారేం పున్నయ్య గారూ! ఈ మాట మీరు ముందే చెప్పంటే మేం ఇంతసేపు ఇలా కాచుకు కూర్చునే వాళ్ళమే కాదు.''

అంటూ వంద రూపాయలు జేబులోంచి తీసి పున్నయ్య చేతిలో పెట్టాడు.

పున్నయ్య ముఖం ఒక్కసారిగా పువ్వులాగ విడి పోయింది. మామయ్య ఇచ్చిన వంద అంతకు ముందు కిందపడిన పాతిక కూడా తీసి జేబులో పెట్టుకుని ''మీరు నన్నడిగారూ!'' అంటూ ఆఫీసరు గది తలుపు తీసి లోపలికి వెళ్ళండన్నట్లుగా సౌంజ్ఞ చేశాడు.

''నూట పాతిక రూపాయలు గోవిందా'' అనుకుంటూ ఆఫీసరు గారి గదిలో అడుగు పెట్టాము.

** ** **

మేము లోపలికి వెళ్ళేసరికి ఆఫీసరుగారు పెన్సిలు మొనతో గోళ్ళల్లో ఇరుక్కుపోయిన మట్టి తీసుకుంటు న్నారు. లోపల ఆయన తప్ప వేరెవ్వరూ లేరు.

మమ్మల్ని మేము ఫలానా మంత్రిగారి తేండే దేట్లుగా పరిచయం చేసుకుని ఆ మంత్రి గారు రాసిచ్చిన ఉత్తరం ఆయన చేతికిచ్చాము.

ఆయన ఆ ఉత్తరం చదువుకుని మమ్మల్ని తన ఎదురుగా వున్న కుర్చీల్లో కూర్చోమన్నారు. నేను సంశయించాను. మామయ్య గబుక్కున వెళ్ళి ఆఫీసరు గారి కెదురుగా వున్న కుర్చీలో కూర్చున్నాడు. నేను నెమ్మదిగా మామయ్య ప్రక్కన కూర్చున్నాను.

ఆయన మామయ్య పది నిముషాల సేపు మాట్లాడుకున్నారు.

''ఇంకమేము వెళ్ళొస్తాము. తమరు దయవుంచాలి. మా వాడిపేరు డి.అనంత వీర వెంకట సత్యనారాయణ రామాంజనేయ శాస్త్రి.''

అంటూ కుర్చీలోంచి లేచాడు మామయ్య. నేను కూడా మామయ్యతోబాటే లేచాను.

''అలాగే అంతా నేను చూసుకుంటా లెండి''

అభయమిచ్చారు ఆఫీసరు గారు.

ఇద్దరం బైటికి వచ్చాము.

''మామయ్యా! ఈయన ఆమ్యామ్యాలాంటిది అడగలేదేం'' అన్నాను అమాయకంగా

ఇలాగయితే ఎలా బతుకుతావురా అన్నట్లు నావైపొకసారి చూసి

''బల్లకింద నుండి మూడు వేలు అందించేసులే'' అన్నాడు మామయ్య చల్లగా.

నాకు తల తిరిగినంత పనయింది.

ఇప్పటికి ఈ ఉద్యోగం కోసం ఆరువేల నూట పాతిక రూపాయలు ఖర్చుతో ఆరువేల రెండొంద లయింది.

భగవంతుడికో నమస్కారం చేసి ఇంటిదారి పట్టేను.

** ** **

''మీ పేరు''

చెప్పాను.

నలుగురు అధికారులు నన్ను ఇంటర్వ్యూ చేస్తు న్నారు.

నలుగురూ నాలుగు లోకేశ్వరాలా కనిపించారు నా కళ్ళకి. నేనేమాత్రం తప్పులడుగు వేసినా నా చర్మం కండలు వేరు చేసేస్తామన్నట్లుగా వున్నాయి వాళ్ళ చూపులు. నిన్న నా దగ్గర మూడు వేల రూపాయలు పుచ్చుకున్న ఆఫీసరు కూడా ఆ ఇంటర్వ్యూ బోర్డులో వున్నాడు.

''అమెరికా అధ్యక్షుడెవరు?''

చెప్పాను.

''మొదటి పానిపట్టుయుద్ధం ఎప్పుడు జరిగింది?''

అమెరికా అధ్యక్షుడికి, మొదటి పానిపట్టు యుద్ధానికి, నాకివ్వబోయే ఉద్యోగానికి సంబంధ మేమిటో నాకు బోధపడలేదు.

అయినా సమాధానం చెప్పాను.

''మీరు ఎంతవరకూ చదువు కున్నారు?''

''ఎమ్మే''

''లేటెస్ట్‌గా మీరు చూసిన సినిమా ఏమిటి''

నిన్న నా దగ్గర మూడు వేలు పుచ్చుకున్న ఆఫీసరు అడిగేడు.

''ఈ చదువులు మాకొద్దు''

అన్నాను ఓరగా ఆ ఆఫీసర్ని చూస్తూ.

''ఇక మీరు వెళ్ళొచ్చు''

బైటికొచ్చేసాను.

అక్కడి క్లర్కు మర్నాడుదయం కనబడమన్నాడు.

* ** **

ఆ మర్నాడుదయం......

నా చేతికొచ్చిన ఆర్డరు చూడగానే నాకు కళ్ళు తిరిగినంత పనయింది.

అది ఆరునెలల టెంపరరీ ఉద్యోగం.

ఆ ఆఫీసులో ఎవరో గుమస్తా ఆరు నెలలు సెలవు పెడితే ఆ లీవు వేకెన్సీలో నన్ను పోస్టు చేశారు. ఆరు నెలలు పోయాక అతను జాయినైపోతే నన్ను తీసే స్తారన్నమాట.

ఎంత మోసం!

నాకు పిచ్చికోసం వచ్చింది. ఈ టెంపరరీ ఉద్యోగం కోసమా వీళ్ళందరూ నాచేత ఆరు వేలు ఖర్చు పెట్టించింది.

ఆవేశంగా ఆఫీసరు రూములోకి వెళ్ళాను. ఆవేళ ఆ ఆఫీసరు సెలవు పెట్టాడట. చేసేది లేక వ్రేలాడిన మొహం వేసుకుని మామయ్య దగ్గరకు వెళ్ళాను.

మామయ్య ఆ ఆర్డరు చూసి చాలాసేపు ఆలోచనలో పడిపోయాడు.

''ఒరేయ్ అబ్బాయ్! ఆవేశం అనర్థానికి దారి తీస్తుందిరా! వారం రోజుల్లో వాళ్ళు నీదగ్గర నుండి ఆరు వేలు సంపాదించేరు. ఇప్పుడు నువ్వా సీటులోకి వెళ్తున్నావు. ఈ ఆరు నెల్లలోను అరవై వేలు సంపాదించుకునిరా! ఆ తరువాత వ్యాపారం పెట్టుకుని బతుకుదువుగాని. అప్పుడిలాంటి ఉద్యోగాల కోసం ఎక్కడా బాకనక్కర్లేదు. చేతులు కాల్చుకోనూ అక్కర్లేదు.''

అప్రస్తుతన్యాసం చేసిన అర్జునుడు ..... చేసిన కృష్ణ మూర్తిలాగ కనిపించాడు మామయ్య.

నిజమే! మామయ్య మాటల్లో సత్యం వుంది.

అందుకే ఆరు నెల్లలో అరవై వేలు సంపాదించడానికి, మామయ్య చూపించిన బాటలో నడవడానికి నిశ్చయించుకున్నాను.

ఆరు నెలల తరువాత మెయిన్‌రోడ్డులో నేను ఫ్యాన్సీ షాపు పెట్టడం చూసి చాలా మంది ఆశ్చర్య పోయారు.